సాక్షి వైఎస్సార్ జిల్లా

బుధవారం । 20 । మార్చి । 2024



విమాన సేవలకు సాయం

రాయలసీమ ప్రజలు మరో ఏడాదిపాటు చౌక చార్జీలతో విమాన ప్రయాణాన్ని సాగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. -8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధ (సా॥)	సహర్ గురు (ఉ॥)
కడప	: 6.30	5.05
పులివెందుల	: 6.33	5.00
ప్రొద్దుటూరు	: 6.32	5.09

వాతావరణం

గరిష్టం/కనిష్టం 39.8/23.8

జిల్లాలో మంగళవారం 23.8 - 39.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.37 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

వైవీయూ ఎల్ఎల్‌బీ పరీక్ష తేదీల్లో మార్పు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలో ఈ నెల 23వ తేదీన నిర్వహించాల్సిన 3, 5 సంవత్సరాల న్యాయ(ఎల్ఎల్‌బీ) పరీక్షలు 24వ తేదీకి వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి తెలిపారు. కొన్ని సాంకేతిక కారణాల దృష్ట్యా ఈ మార్పు చేశామని, విద్యార్థులు గమనించాలని సూచించారు. మిగిలిన పరీక్షలు యథావిధిగా జరుగుతాయని ఆయన పేర్కొన్నారు.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా సుధాకర్‌రెడ్డి

కడప కార్పొరేషన్: ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ జిల్లా కమలాపురం నియోజకవర్గానికి చెందిన నిమ్మకాయల సుధాకర్‌రెడ్డిని రాష్ట్ర పార్టీ కార్యదర్శిగా నియమిస్తున్నట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

మైనార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ ఇర్ఫాన్

వైఎస్సార్ జిల్లా కమలాపురం నియోజకవర్గానికి చెందిన షేక్ మహమ్మద్ ఇర్ఫాన్‌బాషను జిల్లా మైనార్టీ విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

పోలింగ్ కేంద్రాల తనిఖీ




ఇసుకపల్లెలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ గణేష్‌కుమార్

పెండ్లిమర్రి: మండలంలోని మొయిళ్లకాల్వ, రంపతాడు, ఇసుకపల్లె, పాతసంగటిపల్లె గ్రామాలల్లో పోలింగ్ కేంద్రాలను మంగళవారం జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అవసరమైన అన్ని వసతులు కల్పించాలని తహశీల్దార్‌కు సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. ఈకార్యక్రమంలో తహశీల్దార్ చంద్రశేఖర్ వర్మ, ఆర్‌ఐ శ్రీను, వీఆర్వోలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పదోతరగతి పరీక్షలు

వైవీయూ : పదోతరగతి పరీక్షలు జిల్లా వ్యాప్తంగా రెండోరోజు మంగళవారం ప్రశాంతంగా సాగాయి. జిల్లా వ్యాప్తంగా 153 పరీక్షా కేంద్రాల్లో రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు 28,180 మంది పరీక్షలకు హాజరు అయ్యారని.. 532 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం. అనూరాధ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 11 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 63 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయగా, కడప నగరంలోని 6 పరీక్షా కేంద్రాలను డీఈఓ ఎం. అనూరాధ పరిశీలించారు. పది పరీక్షల జిల్లా పరిశీలకులు ఎం. వెంకటకృష్ణారెడ్డి 8 పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షల నిర్వహణ పకడ్బందీగా, ప్రశాంతవాతావరణంలో నిర్వహిస్తున్నట్లు డీఈఓ తెలిపారు.

దేవునికడప ఆలయ సిబ్బంది వేతనాల పెంపు



కడప కల్చరల్: దేవుని కడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ సిబ్బందికి వేతనాలు పెంచారు. ఇటీవల తిరుపతిలో జరిగిన ప్రత్యేక సమావేశంలో టీటీడీ అధికారులు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. జిల్లా దేవదాయశాఖ పరిధిలో ఉండిన దేవుని కడప ఆలయాన్ని 2006లో తిరుమల-తిరుపతి దేవస్థానాల పరిధిలోకి తీసుకున్నారు. ఒకరిద్దరు అర్చకులు మినహా మిగతా అర్చకులు, సహాయ అర్చకులు, ఇతర సిబ్బందికి తాత్కాలిక వేతనాలు చెల్లించేవారు. ఈ విషయంగా అర్చకుల సంఘాలు, టీటీడీ అధికారులను కలిసి సమస్యను వివరించారు. స్పందించిన టీటీడీ ఉన్నతాధికారులు సిబ్బందికి వేతనాలు పెంచారు. ఇందులో నెలకు రూ. 5 వేలకు పనిచేసే వారికి రూ. 15 వేలు, రూ. 10 వేలతో పనిచేసే వారికి రూ. 20 వేలు, రూ. 15 వేలతో పనిచేసే వారికి రూ. 25 వేలు చొప్పున ఆలయ సిబ్బందికి ఈ వేతనాలు పెంచాలని నిర్ణయం తీసుకున్నారు. దేవునికడప ఆలయంలో వేద పండితులు, అర్చకులు, సహాయకులు, పరిచారకులు, పోటు కార్యాలయ సిబ్బంది తదితర సిబ్బంది మొత్తం 28 మందికి వేతనాల పెంపు వర్తించనుంది. మార్చి మాసం నుంచి ఈ వేతనాలు వర్తించే అవకాశం ఉంది. జీతాలు పెంచడం పట్ల ఆనందంగా ఉందని అర్చకులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధి పని.. లక్ష్యాన్ని మించి..

- గడువు ఉండగానే ఉపాధి లక్ష్యం పూర్తి
- నెలాఖరుకు అదనపు పనిదినాలు పూర్తికి కసరత్తు
- రోజుకు 36 వేల మంది ఉపాధి పనులకు హాజరు
- పనులు జరిగే చోట వసతులు ఏర్పాటు
- ఉదయం 11 గంటలకే పనుల ముగింపు
- ఇప్పటివరకు 15,420 కుటుంబాలకు వంద రోజుల పనిదినాలు



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ యదుభూషణరెడ్డి

కడప సిటీ: గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు ఉపాధి హామీ పథకం ఎంతో తోడ్పాటును అందిస్తోంది. ప్రజల ఆర్థికాభివృద్ధిని పెంపొందించేందుకు చక్కటి అవకాశంగా ఏర్పడింది. ప్రభుత్వం ఆ దిశగా పనులను నివసించే గ్రామంలోనే ఏర్పాటు చేసి ప్రజలకు ఆదరువుగా నిలబడుతోంది. 18 సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఉపాధి హామీ పథకం తోడుగా ఉంటూ ఆదుకుంటోంది. అంతేకాకుండా వేతనాలను కూడా ఎప్పటికప్పుడు ఖాతాల్లో జమ చేస్తుండడంతో పనులకు వచ్చేందుకు కూలీలు ఆసక్తి కనబరుస్తున్నారు.

- ఈ నేపథ్యంలో జిల్లాలో నిర్ణయించిన పనిదినాలను గడువుముందే లక్ష్యాన్ని పూర్తి చేసి ముందుకు చేరిన పరిస్థితి ఉంది. పనిదినాలు లక్ష్యం పూర్తి కావడంతో ప్రభుత్వం కూలీలకు మరిన్ని పనిదినాలు కల్పించాలన్న ఉద్దేశ్యంతో మరో ఏడు లక్షల పనిదినాలను పెంచి వారి జీవనోపాధికి మార్గం సుగమం చేసింది.
- వేసవి కాలం కావడంతో ఎండ తీవ్రత నేపథ్యంలో కూలీలకు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు వహిస్తున్నారు. వేకువజామునే పనులకు వెళ్లి ఉదయం 11 గంటలకే తిరిగి ఇంటికి చేరేలా చర్యలు చేపడుతున్నారు.
- ఈ ఆర్థిక సంవత్సరం ఉపాధి హామీ పథకంలో పనుల నిర్వహణలో జిల్లా ముందంజలో ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 73 లక్షల పని దినాలను చేపట్టాలన్నది ప్రణాళిక. అయితే ఈ లక్ష్యాన్ని కేవలం గడువుకు ముందే అంటే ఫిబ్రవరి నెలాఖరుకే పనిదినాలను జిల్లాలో పూర్తి చేశారు.

అదనంగా..

జిల్లాలో ఫిబ్రవరి నెలాఖరుకే నిర్ణయించిన పనిదినాలు పూర్తి కావడంతో అదనంగా మరో ఏడు లక్షల పనిదినాలను ప్రభుత్వం జిల్లాకు కేటాయించింది. వేసవికావడంతో పనికి వచ్చేందుకు కూలీలు ఆసక్తిగా ఉండడంతో ప్రభుత్వం అదనంగా పనిదినాలను పెంచేందుకు నిర్ణయం తీసుకుంది. అయితే ఇప్పటికే 76,24,210 పని దినాలు నమోదయ్యాయి. ఇక మిగిలిన పని దినాలను ఈనెలాఖరుకు పూర్తి చేయాల్సి ఉంటుంది.

పనుల వద్ద వసతులు..

ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉన్నాయి. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఉపాధి హామీ కూలీలకు పనుల వద్ద ఎటువంటి ఇబ్బందులు లేకుండా జిల్లా యంత్రాంగం వసతులు కల్పిస్తోంది. ప్రధానంగా పనులు జరిగే చోట గుడారాల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. అంతేకాకుండా వడదెబ్బకు గురికాకుండా స్థానిక పీహెచ్‌సీల నుంచి ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేస్తున్నారు. ప్రథమ చికిత్స పెట్టెలను కూడా వారికి అందుబాటులో ఉంచుతున్నారు. ఉదయాన్నే పనులకు వెళ్లి 11.00 గంటలకే తిరిగి వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేసి పనులు నిర్వహిస్తున్నారు.

నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత

ఉపాధి హామీ పథకంలో నీటి సంరక్షణ పనులకే అధిక ప్రాధాన్యతనిస్తున్నారు. ఖండిత కందకాలు, ఫారం పాండ్స్, చెరువుల పునరుద్ధరణ పనులు, ప్లాంటేషన్ పనులు, కాలువల్లో పూడికతీత పనులు తదితర నీటి సంరక్షణ పనులు చేపడుతున్నారు. అలాగే నిర్మాణాత్మక (మెటీరియల్) పనులకు సంబంధించి గ్రామ సచివాలయాలు, బల్క్ మిల్క్ సెంటర్లు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, లైబ్రరీలు, సిమెంటు రోడ్లు తదితర పనులను చేస్తున్నారు.

మొత్తం జాబ్ కార్డులు :	2,30,260
అందులో ఉన్న కూలీల సంఖ్య:	4,14,289
యాక్టివ్ జాబ్ కార్డులు :	1,96,331
యాక్టివ్‌లో ఉన్న కూలీల సంఖ్య:	3,35,061
పనుల లక్ష్యం పూర్తి దినాలు :	73 లక్షలు
అదనంగా పనిదినాలు :	7 లక్షలు
వంద రోజులు పూర్తి చేసుకున్న కుటుంబాలు:	15,420
మొత్తం బడ్జెట్ :	రూ. 362.67 కోట్లు
ఇప్పటివరకు కూలీలకు ఖర్చు చేసిన మొత్తం:	రూ. 187.54 కోట్లు
నిర్మాణాత్మక పనులకు ఖర్చు చేసిన మొత్తం:	రూ. 112.11 కోట్లు (మెటీరియల్)



గుడారంలో సేద తీరుతున్న ఉపాధి కూలీలు

దిశా నిర్దేశం



జిల్లాలో ఉపాధి పనుల విషయం, నిర్వహణపై ఎప్పటికప్పుడు దిశా నిర్దేశం చేస్తున్నాం. ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నాం. గడువుముందే పనిదినాలు పూర్తి కావడం శుభపరిణామం. ఉపాధి సిబ్బంది క్షేత్ర స్థాయిలో పెంచిన అదనపు పనిదినాలను పూర్తి చేసేందుకు మరింత కృషి చేయాల్సి ఉంది. - విజయరామరాజు, కలెక్టర్, వైఎస్సార్ జిల్లా

కూలీలకు ఇబ్బందులు లేకుండా వసతులు



వేసవి కాలంలో కూలీలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఎండ తీవ్రత కాకముందే ఇంటికి చేరుకునేలా ప్రణాళికలు సిద్ధం చేశాం. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాం. గుడారాలు కూడా పనుల వద్దనే ఏర్పాటుకు చర్యలు చేపట్టాం. అదనపు పనిదినాలను నెలాఖరుకు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం. - యదుభూషణరెడ్డి, పీడీ, డ్వామా, కడప

27న ప్రొద్దుటూరులో బస్సు యాత్ర

- బహిరంగ సభలో ప్రసంగించనున్న సీఎం వైఎస్ జగన్
- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



సభాస్థలిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 27వ తేదీన ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బస్సు యాత్ర నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. 27న ఇడుపులపాయలో కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం బస్సు యాత్ర ప్రొద్దుటూరుకు చేరుతుందన్నారు. అదే రోజు సాయంత్రం ప్రొద్దుటూరులో తొలి సభను సీఎం జగన్ అధ్యక్షతన నిర్వహించడం జరుగుతుందన్నారు. సిద్ధం సభలు నిర్వహించిన నాలుగు జిల్లాలు మినహా 21 రోజుల పాటు బస్సు యాత్ర సాగుతుందని తెలిపారు. తొలి రోజు బహిరంగ సభ ప్రొద్దుటూరులో నిర్వహించాలని సీఎం నిర్ణయించడం తమకెంతో సంతోషంగా ఉందన్నారు. కడప పార్లమెంట్ పరిధిలోని 7 నియోజకవర్గాల నుంచి ఈ సభకు లక్ష మంది హాజరవుతారని ఎమ్మెల్యే వివరించారు.

బస్సుయాత్ర సభ కోసం స్థల సరిశీలన

ప్రొద్దుటూరులో బస్సు యాత్ర సభ కోసం అవసరమైన స్థలాన్ని మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే రాచమల్లు పరిశీలించారు. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో స్థలం అనువుగా ఉంటుందని చర్చించారు. ఎమ్మెల్యే వెంట జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ కల్లూరు నాగేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, రాష్ట్ర ప్రోగ్రాం కన్వీనర్ చంద్రహాస్ రెడ్డి, కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి తదితరులు ఉన్నారు.

నిజాయితీపరులకు పార్టీలో భవిష్యత్ గ్యారెంటీ

- ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి
- వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి
- వేలాదిగా తరలి వచ్చిన అనుచరులు
- నిజాయితీ ఉన్న వారికి వైఎస్సార్‌సీపీలో మంచి భవిష్యత్తు
- ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి





ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే రఘురామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు, అనుచరులు, మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

మైదుకూరు: టీడీపీ ఆవిర్భావం నుంచి 42 ఏళ్ల పాటు నిజాయితీతో, నిబద్ధతతో పనిచేసిన రెడ్యం వెంకటసుబ్బారెడ్డిని చంద్రబాబు అవమానించారని, తాము మనస్ఫూర్తిగా.. గౌరవంగా వైఎస్సార్‌సీపీలోకి ఆయనను ఆహ్వానించామని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం మైదుకూరులోని డీసీఎల్ ఫంక్షన్ హాల్‌లో వేలాది మంది అనుచరులతో టీడీపీ మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆయనతో పాటు ఆయన సోదరులు కేసీ కాలువ డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ రెడ్యం ఆదినారాయణరెడ్డి, దువ్వూరు మండలం గుడిపాడు మాజీ సర్పంచ్ తుమ్మల కొండారెడ్డి తదితరులకు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

- ఈ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీలో తాను చేరితే ఆ పార్టీ మరింత బలోపేతం అయ్యే విధంగా కృషి చేస్తానని రెడ్యం వెంకటసుబ్బారెడ్డి మాట ఇచ్చారని, అందుకు ఆయనకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. పార్టీలో ఆయనకు, ఆయన కుటుంబ సభ్యులకు, అనుచరులకు సముచిత గౌరవం ఉంటుందని పేర్కొన్నారు.

మన ప్రాంత బిడ్డ వైఎస్ జగన్‌ను ఆదరించండి

చెప్పిన పని చేసి, ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మన ప్రాంత బిడ్డ, మన జిల్లా వాసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి అయ్యేందుకు ప్రతి ఒక్కరూ ఆదరించాలని ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి కోరారు. మైదుకూరు వ్యవసాయ ఆధారిత ప్రాంతమని అన్నారు. ఈ ప్రాంతంతోపాటు జిల్లాకు మేలు చేసేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 11 వేల క్యూసెక్కుల నుంచి 44వేల క్యూసెక్కులకు పెంచారని తెలిపారు. దీని వల్ల కేసీ కాలువ, తెలుగుగంగకు పుష్కలంగా నీరు అందుతుందని అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి బాటలో నడుస్తూ పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని 80 వేల క్యూసెక్కులకు పెంచుతున్నారని తెలిపారు. శ్రీశైలంలో 885 అడుగుల నీరు ఉంటేనే మనం నీరు వాడుకునేందుకు వీలుంటుందని, అలాంటిది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బనకచర్ల వద్ద ఎత్తిపోతల పథకం రూపొందించి 790 అడుగులు ఉన్నా నీరు తీసుకునేందుకు మార్గం సుగమం చేశారని తెలిపారు. చంద్రబాబు హయాంలో వెలుగోడు నుంచి ఎస్ఆర్-1, ఎస్ఆర్-2, బ్రహ్మంసాగర్‌కు నీళ్లు రాని దుస్థితి ఉండేదన్నారు. ప్రధాన కాలువ 0 నుంచి 14 కిలోమీటర్ల వరకు కాలువను బాగు చేయించమని ఎన్నో సార్లు అడిగినా చంద్రబాబు పట్టించుకోలేదని ఆరోపించారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎం కాగానే రూ.600 కోట్లతో పనులు చేయించారని వివరించారు. ఇంత మేలు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రతి ఒక్కరూ ఆదరించాలని ఎంపీ కోరారు.

వైఎస్సార్‌సీపీలో మంచి భవిష్యత్తు

నిజాయితీతో పార్టీ అభివృద్ధికి కృషి చేసే వాళ్లకు వైఎస్సార్‌సీపీలో మంచి భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తెలిపారు. టీడీపీలో 42 ఏళ్లుగా ఉంటూ ఎన్ని ప్రలోభాలు పెట్టినా లొంగని రెడ్యం వెంకటసుబ్బారెడ్డి సిన్సియర్ నాయకుడని అన్నారు. తాను చనిపోయినా తన శవంపై టీడీపీ జెండా కప్పాలని చెప్పిన రెడ్యం, అవమానకర రీతిలో టీడీపీని వీడారని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ రెడ్యంను, ఆయన అనుచరులను సాదరంగా ఆహ్వానించిందని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎప్పటికీ టీడీపీలాగా అబద్ధాలు చెప్పదని, మోసాలు చేయదని, సిన్సియర్‌గా ఉన్న వాళ్లకు వైఎస్సార్‌సీపీలో న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రెడ్యం, ఆయన అనుచరులకు పార్టీలో న్యాయం చేస్తామన్నారు.

- కార్యక్రమంలో రెడ్యం కుటుంబ సభ్యులు, అనుచరులు ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డిలను గజమాలతో సత్కరించారు. రెడ్యం సోదరుడు చంద్రశేఖర్‌రెడ్డి, గుడిపాడు మాజీ సర్పంచ్ తుమ్మల కొండారెడ్డి మాట్లాడారు.
- ఎమ్మెల్సీలు ఆర్.రమేష్‌యాదవ్, రామచంద్రారెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయశాఖ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, ఉద్యానశాఖ సలహాదారుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్మయి, శక్తి మిషన్ సభ్యురాలు మూలే సరస్వతమ్మ, నియోజకవర్గంలోని ఎంపీపీలు, జెడ్పీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భారీ ర్యాలీగా రెడ్యం సోదరులు

ఖాజీపేట: తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, ఆయన సోదరులు కలిసి దుంపలగట్టు గ్రామం నుంచి తమ అనుచరులతో భారీ ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. సుమారు వెయ్యి మంది తన అనుచరులతో బైక్ ర్యాలీతో పెద్ద ఎత్తున బాణసంచా కాల్చుకుంటూ ఖాజీపేట కూడలికి చేరుకున్నారు. మహాత్మాగాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం తన కాన్వాయ్‌తో మైదుకూరు డీసీఎల్ కల్యాణ మండపానికి చేరుకున్నారు.

డబ్బు వైపే మొగ్గు చూపిన చంద్రబాబు : రెడ్యం

నిజాయితీ కంటే డబ్బు వైపే చంద్రబాబు మొగ్గు చూపారని వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నేత రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ఆరోపించారు. తన ప్రాణాలకు ముప్పు ఉన్నా టీడీపీ అభివృద్ధి కోసం 42 ఏళ్లుగా అహర్నిశలు కృషి చేసినా తనను చంద్రబాబు అవమానకర రీతిలో పార్టీ నుంచి తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. నిజాయితీతో పని చేస్తున్న తనను కాదని పదేళ్ల కిందట పార్టీలోకి వచ్చిన డబ్బున్న సుధాకర్ యాదవ్ మాటలు నమ్మి తనను తొలగించిన చంద్రబాబు ఇక కార్యకర్తలను ఏం ఆదుకుంటారని ప్రశ్నించారు. అవమానం జరిగిన చోట ఉండకూడదని ఆత్మగౌరవం ఉండే చోటే ఉండాలని తాను వైఎస్సార్‌సీపీలోకి వచ్చానని స్పష్టం చేశారు. వైఎస్ కుటుంబం అంటే ఒక బ్రాండ్ అని, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తనను పార్టీలోకి ఆహ్వానించినందుకు ధన్యవాదాలు తెలిపారు. తన ఉసురు తగిలి టీడీపీ సర్వనాశనం అవతుందని, సుధాకర్ యాదవ్ నిద్రలేని రాత్రులు గడపాల్సి వస్తుందని పేర్కొన్నారు. రాబోవు ఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీ ప్రభంజనం సృష్టిస్తుందన్నారు. ఈ ఎన్నికల్లో వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి హ్యాట్రిక్ కొట్టాలని ఆకాంక్షించారు.

పార్లమెంట్‌లో ప్రసంగించిన విద్యార్థులకు ఘన సత్కారం



మిద్దె రూప, సయ్యద్ సానియాలను సత్కరిస్తున్న కళాశాల అధ్యాపక బృందం

వైవీయూ: కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన పూర్వ విద్యార్థులు మిద్దె రూప, ఎస్.సానియాలు భారత యూత్ పార్లమెంట్‌లో పాల్గొని ఉపన్యసించడం పట్ల వారికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ కళాశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా, నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి ఎం. మణికంఠ విచ్చేసి మిద్దె రూప, సానియాలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల పూర్వ విద్యార్థిని మిద్దెరూప 2022 అక్టోబర్ 2న పార్లమెంట్‌లో చక్కగా ప్రసంగించిందని, తాజాగా 2024 మార్చి 5,6 తేదీల్లో కళాశాల పూర్వ విద్యార్థిని సయ్యద్ సానియా యూత్ పార్లమెంట్‌లో చక్కగా ఉపన్యసించిందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

రైల్వే ఎస్ఐకి సేవా పతకం



జగన్‌మోహన్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్: రైల్వేశాఖలో ఆర్మ్‌డ్ రిజర్వు సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వ సేవా పతకం వరించింది. విధి నిర్వహణలో ఏకాగ్రత, క్రమశిక్షణ, స్ఫూర్తి ప్రదాతగా నిలిచిన ఎస్ఐ సేవలను గుర్తించి సేవా పతకానికి ఎంపిక చేశారు. 1989లో కడపలో ఏఆర్ కానిస్టేబుల్‌గా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రస్తుతం రైల్వే ఏఆర్ ఎస్ఐగా పనిచేస్తున్నారు. ఆగస్టు 15న జగన్‌మోహన్‌రెడ్డిఈ సేవా పతకాన్ని గుంతకల్లు రైల్వే ఎస్పీ చేతుల మీదుగా అందుకోనున్నారు. సేవా పతకం పొందిన ఎస్ఐకి సహచర ఉద్యోగులతోపాటు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు శుభాకాంక్షలు తెలియజేశారు.

స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద కట్టుదిట్టమైన భద్రత

జిల్లా కలెక్టర్ వి.విజయరామరాజు

బద్వేలు అర్బన్ : ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సామాగ్రిని నిల్వ ఉంచేందుకు ఆయా నియోజకవర్గాల్లో ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పూర్తి సౌకర్యాలతో పాటు కట్టుదిట్టమైన భద్రత ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వి.విజయరామరాజు పేర్కొన్నారు. మంగళవారం బద్వేలు నియోజకవర్గానికి సంబంధించి మడకలవారిపల్లె సమీపంలోని బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్‌రూమ్‌ను ఆయన పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్‌కు వినియోగించే గదులు, సౌకర్యాలపై ఆర్డీఓను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ, నియోజకవర్గ ఎన్నికల అధికారి ఆకుల వెంకటరమణ, తహసీల్దార్లు మధుసూదన్‌రావు, రోశయ్య, అర్బన్, మున్సిపల్ కమిషనర్ ఎం.క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.



బద్వేలు అర్బన్ : గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ విజయరామరాజు

సీబీఐటీలో స్ట్రాంగ్ రూం ఏర్పాటుకు పరిశీలన

చాపాడు: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మైదుకూరు నియోజకవర్గ స్థాయిలో ఎన్నికల సామాగ్రిని భద్రపరిచేందుకు సీబీఐటీ వద్ద స్ట్రాంగ్ రూం ఏర్పాటు చేసేందుకు జిల్లా కలెక్టర్ విజయరామరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికలకు సీబీఐటీ కళాశాలలోనే నియోజకవర్గ స్థాయిలో స్ట్రాంగ్ రూం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ ఏడాది కూడా అనుకూలమైన ప్రదేశాలను పరిశీలిస్తున్నామని, ఇందులో భాగంగా సీబీఐటీలో స్ట్రాంగ్ రూం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ క్రమంలో రెవెన్యూ సిబ్బంది, పోలీసులు నిబంధనల మేరకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ భూషణం, ఎంపీడీఓ మహబూబ్‌బీ, సీబీఐటీ కళాశాల కరస్పాండెంట్ జయచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

మూడు ట్రాక్టర్లకు జరిమానా

అట్లూరు : రికార్డులు సక్రమంగా లేకుండా అక్రమంగా తిరుగుతున్న మూడు ట్రాక్టర్లకు జరిమానా విధించినట్లు స్థానిక ఎస్ఐ కె.సి.రాజు తెలిపారు. మండల పరిధిలోని సగిలేరు సమీపాన అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని సమాచారం అందడంతో అక్కడికి వెళ్లినట్లు ఆయన పేర్కొన్నారు. మూడు ట్రాక్టర్లు కనిపించడంతో వాటి రికార్డులను పరిశీలించగా సక్రమంగా లేకపోవడంతో జరిమానా విధించినట్లు వివరించారు.

రిమ్స్‌లో గుర్తు తెలియని మృతదేహం



కడప అర్బన్ : కడప నగర శివారులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి మార్చురీలో గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం వున్నట్లు ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు మంగళవారం తెలియజేశారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు, బంధువులు ఎవరైనా వుంటే తమను తగిన ఆధారాలతో సంప్రదించాలని ఆర్ఎంఓ కోరారు.

యువకుడిపై కత్తితో దాడి

కడప అర్బన్ : కడప నగరంలోని అల్మాస్‌పేట సర్కిల్‌లో సోమవారం రాత్రి మసీదు నుంచి ఇంటికి వస్తుండగా మౌలానా అనే యువకుడిపై రఖీబ్‌తోపాటు మరో నలుగురు దాడికి పాల్పడ్డారు. మౌలానాను, వారి నుంచి కాపాడేందుకు జియావుద్దీన్ అడ్డుకున్నాడు. ఈక్రమంలో రఖీబ్, అతని స్నేహితులు జియావుద్దీన్‌పై కత్తితో దాడి చేసి వీపునకు గాయపరిచారు. జియావుద్దీన్‌ను ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ సంజీవరాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

విమాన సేవలకు ప్రభుత్వ సాయం

- 'సీమ' వాసులకు మరో ఏడాది చౌక విమానయానం
- వీజీఎఫ్ సాయం పొడిగించిన రాష్ట్ర ప్రభుత్వం
- కడప–హైదరబాదు సర్వీసుకు రూ.12 కోట్ల రాయితీ
- కర్నూలు ఎయిర్‌పోర్టు నుంచి సర్వీసులు నడిపేందుకు రూ.33 కోట్లు



కడప కోటిరెడ్డిసర్కిల్ : రాయలసీమ ప్రజలు మరో ఏడాదిపాటు చౌక చార్జీలతో విమాన ప్రయాణాన్ని సాగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. వయబులిటీ గ్యాప్ ఫండ్ (వీజీఎఫ్) పథకాన్ని మరో ఏడాది పొడిగించడం వల్ల ప్రజలకు ఈ అవకాశం అందుబాటులోకి వచ్చింది. కడప–హైదరాబాదు మధ్య సర్వీసు నడిచేందుకు రూ.12 కోట్లు, కర్నూలు జిల్లాలోని ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఎయిర్‌పోర్టు నుంచి బెంగుళూరు, చెన్నై, విశాఖపట్టణంలకు సర్వీసులు నడిచేందుకు వీలుగా రూ.33 కోట్లను ఇంటర్ గ్లోబ్ ఏవీయేషన్ లిమిటెడ్ (ఇండిగో) సంస్థకు కేటాయించింది. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్వెస్టిమెంట్ (ఎయిర్‌పోర్ట్స్) డిపార్టుమెంటు ద్వారా ఈ సాయం అందించనుంది. ఇందుకు సంబంధించి జీఓ ఆర్‌టీ నెంబరు 23ను ప్రభుత్వం ఇటీవల జారీ చేసింది.

ప్రభుత్వ నిర్ణయం వల్ల మరో ఏడాది చౌక ధరలతో కడప–హైదరాబాదు మధ్య ప్రయాణించేందుకు వీలు ఏర్పడింది. కర్నూలు–బెంగుళూరు–కర్నూలు రూట్‌లో వారానికి మూడు సర్వీసులను ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి వచ్చే ఏడాది మార్చి 31వ తేది వరకు నడిపేందుకు రూ.12 కోట్లు ప్రభుత్వం ఇండిగో సంస్థకు సాయం అందిస్తుంది.

కర్నూలు–చెన్నై–కర్నూలు మధ్య వారానికి మూడు సర్వీసులను ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు నడిపేందుకు రూ.12 కోట్లు ఇవ్వనుంది. కర్నూలు–విశాఖపట్టణం–కర్నూలు మధ్య ఈ ఏడాది ఆగస్టు 16 నుంచి వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు నడిపేందుకు రూ.9 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఇలా ఎయిర్‌పోర్టు నుంచి ఇండిగో సంస్థ విమాన సర్వీసులు నడిపేందుకు రూ.33 కోట్లు ఇవ్వనున్నారు.

కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వశాఖ రీజినల్ కనెక్టివిటీ స్కీమ్ (ఆర్‌సీఎస్–ఉడాన్)ను అమలు చేస్తోంది. ప్రాంతాల మధ్య కనెక్టివిటీ కల్పించేందుకు ఈ పథకాన్ని దేశ వ్యాప్తంగా చేపట్టింది. ఆర్‌సీఎస్ ఉడాన్ పథకం కింద రాష్ట్రంలో కడప, కర్నూలు విమానాశ్రయాలకు చోటు దక్కింది. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా యాజమాన్యం కింద పని చేస్తున్న కడప ఎయిర్‌పోర్టులో 2017 ఏప్రిల్ 27 నుంచి ఉడాన్ అమలు చేస్తున్నారు. ఎయిర్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న కర్నూలు ఎయిర్‌పోర్టులో 2021 మార్చి 28 నుంచి ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. 2017 నవంబరు 16 నుంచి కడప–చెన్నై, 2018 మార్చి 1 నుంచి కడప–విజయవాడ, 2020 మార్చి 1 నుంచి కడప–బెల్గాంల మధ్య ఇండిగో సర్వీసులు చేపట్టింది. వీజీఎఫ్ సహకారంతో మూడేళ్లపాటు ఉడాన్ పథకాన్ని నిర్వహించారు. బెల్గాం మినహా మిగతా రూట్లలో ఇండిగో సంస్థ తమ సర్వీసులను నిలిపివేసింది. నిలిపివేసిన సర్వీసులను పునరుద్ధరించాలని కడప ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వశాఖ దృష్టికి తీసుకెళ్లగా అందుకు అంగీకరించింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అందుకు నడుం బిగించింది. ఏపీ ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌ను రంగంలోకి దింపింది. కడప చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు ఇతర ప్రాంతాలతో కనెక్టివిటీ పెంచడం కోసం చర్యలు చేపట్టింది. చెన్నై–కడప, విజయవాడ–కడప మధ్య వారానికి నాలుగు సర్వీసులు నడిపేందుకు ఏటా రూ.20 కోట్లు, బెంగుళూరు–కడప, విశాఖపట్టణం–కడప రూట్లలో వారానికి మూడు ఫ్లయిట్లను నడిపేందుకు రూ.15 కోట్లను కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకువచ్చింది. ఆర్‌సీఎస్ కింద 2021 మార్చి 28 నుంచి కర్నూలు ఎయిర్‌పోర్టు ద్వారా విశాఖపట్టణం, చెన్నై, బెంగుళూరు రూట్లలో ఇండిగో సంస్థ విమాన సర్వీసులు నడుపుతోంది. మూడేళ్లపాటు వర్తించే ఉడాన్ పథకం ఈనెల 29వ తేదీతో ముగుస్తుంది. ఈనెల 28 నుంచి బెంగుళూరు సెక్టార్‌లో తమ సర్వీసులు నిర్వహించలేమని ఇండిగో సంస్థ చెప్పింది అలాగే కర్నూలు నుంచి చెన్నై, విశాఖపట్టణం రూట్లలో తిరిగే సర్వీసులు ఆగస్టు 15 నుంచి డిస్ కంటిన్యూ కానున్నాయి. కర్నూలు ప్రాంతంలో పరిశ్రమలు, ఎంటర్ ప్రెన్యూర్స్ రావడానికి ఎన్నో అవకాశాలు కనిపిస్తున్నాయి. కొత్త పరిశ్రమలు రావడం ప్రజల సామాజిక ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతుంది. ఈ నేపథ్యంలో కర్నూలు ఎయిర్‌పోర్టు నుంచి విమాన సర్వీసులను కొనసాగింపును రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత అంశంగా తీసుకుంది. ప్రయాణికుల ట్రావెల్ డేటాను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. అలాగే కడప–హైదరాబాదు మధ్య సర్వీసులు నడపాలన్న డిమాండ్ అధికంగా ఉన్నట్లు గుర్తించారు. దీంతో రాయలసీమ ప్రాంత ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని కడప, కర్నూలు ఎయిర్‌పోర్టుల ద్వారా మరో ఏడాదిపాటు చౌక ధరలకే ప్రయాణించే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది.

హత్యాయత్నం కేసులో యువకుడి అరెస్ట్

కడప అర్బన్ : కడప నగరం తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో ఇక్బాల్‌రైస్ మిల్లు ఎదురుగా కడప–కర్నూలు జాతీయ రహదారిలో నరసింహులు (54) అనే వ్యక్తిపై అజీజ్ అనే యువకుడు కత్తితో దాడి చేశాడు. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన వ్యక్తిని రిమ్స్‌లో చికిత్స చేయించారు. ఈ కేసులో నిందితుడు అజీజ్‌ను సోమవారం రాత్రి సీఐ తిమ్మయ్య ఆధ్వర్యంలో చౌటపల్లి దారిలో అరెస్ట్ చేశారు.

కారు, బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు



గాయపడిన సుబ్బయ్య

అట్లూరు : మండల పరిధిలోని అట్లూరు పోలీసుస్టేషన్ సమీపాన మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. కడప వైపు నుంచి వస్తున్న కారును దాని వెనుక నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న వ్యక్తులు ఢీకొన్నారు. దీంతో ద్విచక్ర వాహనంపై వస్తున్న వారికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని వెంటనే 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. గాయపడిన వారు అట్లూరు మండలం కోనరాజుపల్లె గ్రామానికి చెందిన సుబ్బయ్య, గోపయ్య అని స్థానికులు తెలిపారు.

బాబాయి చేతిలో బాలుడి హత్య

పులివెందుల : పట్టణంలోని ఓ బాలుడు తన బాబాయి చేతిలో దారుణ హత్యకు గురయ్యాడు. తల్లి అనురాధదేవి ఫిర్యాదు మేరకు సీఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

పట్టణంలోని నగరగుట్టలో అనురాధదేవి ఆమె కుమారుడు రెడ్డి బాబు నివాసం ఉండేవారు. వారి ఇంటి పక్కనే రెడ్డి బాబు బాబాయ్ సురేష్ ఉండేవాడు. బాబాయ్ మానసిక స్థితి సరిగా లేని కారణంగా రెడ్డి బాబు కుటుంబమే అతనికి భోజనం అందించే వారు. సురేష్‌కు పెళ్లి కాలేదు. రెడ్డిబాబు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుకుంటూ ఉదయం సమయంలో పేపర్ బాయ్‌గా పని చేస్తున్నాడు. సోమవారం ఉదయం తల్లి అనురాధ దేవి తమ కుమార్తె అనారోగ్యంతో ఉండడంతో ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లింది. ఇంటికి వచ్చే సరికి అపస్మారక స్థితిలో పడి ఉన్న రెడ్డి బాబును చూసిన తల్లి వెంటనే ఆసుపత్రి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. తమ బిడ్డను సురేష్ హత్య చేశాడని అనురాధ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పంచసూత్రాలు పాటించి ప్రమాదాలు నివారించాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో పని చేస్తున్న ప్రతి డ్రైవర్ పంచసూత్రాలు పాటిస్తూ ప్రమాదాల నివారణకు తనవంతుగా కృషి చేయాలని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కడప ఆర్ఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో డ్రైవర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థలో డ్రైవర్లు కీలకపాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. విధి నిర్వహణకు హాజరయ్యే డ్రైవర్లు మద్యపానానికి దూరంగా ఉండాలని, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలని, ప్రశాంత వాతావరణంలో విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన విధి నిర్వహణ బాధ్యత డ్రైవర్లపై ఉందన్నారు. ప్రమాద రహిత డ్రైవర్లను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. ఇంధన పొదుపు గురించి పలు సూచనలు చేశారు. అనంతరం ఓం శాంతి సంస్థ ప్రతినిధి ప్రదీప అక్కయ్య డ్రైవర్లచే ధ్యానం చేయించారు. చివరగా తక్కువ కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్లకు డిప్యూటీ సీఎంఈ లక్ష్మిభాస్కర్ దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని కడప, పులివెందుల, బద్వేలు, జమ్మలమడుగు, మైదుకూరు, ప్రొద్దుటూరు డిపోలకు చెందిన 17 మంది డ్రైవర్లు, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

దేశ సమగ్రత, సార్వభౌమాధికారాన్ని కాపాడుకుందాం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా, దేశ సమైక్యత సమగ్రతకు నష్టం కలిగించే సీఏఏను రద్దు చేసే వరకు పోరాడాలని సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు చంద్ర, చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సదస్సులో వారు మాట్లాడారు. నరేంద్రమోదీ ప్రభుత్వం 2019లో పార్లమెంట్‌లో ప్రతిపక్షాల నిరసనల మధ్య ఆమోదింప చేసుకున్న 'పౌరసత్వ సవరణ చట్టం' (సీఏఏ) ఆనాటి ప్రజా ఉద్యమాల ధాటికి తాత్కాలికంగా అమలు చేయలేకపోయిందన్నారు. తర్వాత ఎన్నికలు రాబోతున్న తరుణంలో ఆ చట్టాన్ని అమలులోకి తెచ్చిందన్నారు. ప్రజా సమస్యలను పక్కదారి పట్టించి, ప్రజల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టి, మతకలహాలు సృష్టించి అధికారమే ధ్యేయంగా హిందువుల ఓట్లను కొల్లగొట్టేందుకు, నరమేధానికి తెగబడుతున్నదన్నారు. బీజేపీ ఇంతకాలంగా ప్రయత్నిస్తున్న హిందూత్వ వ్యవస్థను ఏర్పాటు చేయడానికే ఈ ప్రయత్నం అన్నారు. పౌరసత్వ సవరణ చట్టం రాజ్యాంగం మౌలిక స్వరూపానికి విఘాతం కలిగిస్తుందన్నారు. రాజ్యాంగంలోని అధికరణలు 14, 15, 16, 25లను ఉల్లంఘిస్తుందన్నారు. ముస్లింలు అధికంగా వున్న పొరుగు దేశాలలో పీడనకు గురవుతూ, శరణార్థులుగా వచ్చిన వారిని కాపాడేందుకు ఈ చట్టం తెచ్చామని ప్రజల్ని నమ్మించే ప్రయత్నం చేస్తోందన్నారు. శ్రీలంక, బూటాన్, మయన్మార్‌లో పీడనకు గురవుతూ శరణార్థులుగా వస్తున్న వారికి ఎందుకు రక్షణ కల్పించటం లేదని ప్రశ్నించారు. మతం ఆధారంగా పౌరసత్వం ఇవ్వటం ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం నగర కార్యదర్శులు ఎన్. వెంకటశివ, రామ్మోహన్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, వీరశేఖర్, అన్వేష్, కేసీ బాదుల్లా, బి. మనోహర్, శ్రీనివాసులురెడ్డి, దస్తగిరిరెడ్డి, గంగా సురేష్, శివకుమార్, వలరాజు, చిన్ని, మునయ్య, భాగ్యలక్ష్మి, శంకర్ నాయక్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన ఫీల్డ్ అసిస్టెంట్ మృతి



సుబ్బరామిరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ, ఉపాధి సిబ్బంది

వీరపునాయునిపల్లె : మండలంలోని బుసిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంటు లింగారెడ్డి సుబ్బరామిరెడ్డి(35) మృతి చెందాడు. వివరాలలోకి వెళితే.. సోమవారం ఉదయం వేంపల్లె మండలం పాములూరు గుట్ట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలయిన సుబ్బరామిరెడ్డిని కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా పరీక్షలు నిర్వహించిన వైద్యులు తలకు బలమైన గాయాలయ్యాయని బతకడం కష్టమని తెలపడంతో కుటుంబ సభ్యులు తిరుపతి స్విమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు కూడా ఎటువంటి లాభం లేదని తెలపడంతో చేసేదేమీ లేక వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. మంగళవారం ఉదయం మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బుసిరెడ్డిపల్లెకు తీసుకువచ్చారు. మృతునికి భార్యతో పాటు కుమార్తె, కమారుడు ఉన్నారు. విషయం తెలుసుకొన్న రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, సర్పంచు అనూరాధ, కమలాపురం మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి తదితరులు మృతదేహంపై పుష్ప గుచ్చాలు ఉంచి నివాళి అర్పించడంతోపాటు కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎంపీడీఓ పులి రామ్‌సింగ్, ఉపాధిహామీ పథకం ఏపీఓ లక్ష్మినారాయణరెడ్డి, పంచాయతీ కార్యదర్శి నాసరయ్య.. సుబ్బరామిరెడ్డికి నివాళి అర్పించడంతోపాటు దహన సంస్కారాలకు 15 వేల రూపాయలను కుటుంబ సభ్యులకు అందజేశారు. వీరితోపాటు ఉపాధి హామీ పథకం కార్యాలయ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు నివాళులర్పించారు.

సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి



ఎన్జీవోలతో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్

కడప అర్బన్ : విభిన్న ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద వారి అర్హతలను పొందేందుకు, వివిధ లక్ష్య సమూహాలకు సహాయం అందించడానికి ఎన్జీవోలతో మంగళవారం కడపలోని జిల్లా కోర్టు ఆవరణలో న్యాయసేవాసదన్‌లో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ విభిన్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివిధ సమూహాలకు అందేలా ఎన్జీవోలు అవగాహన, చైతన్యం కలిగించాలన్నారు. వివిధ ఎన్జీఓలు వారి కార్యక్రమాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్జీవోల పాత్ర సమాజంలో కీలకమన్నారు. అన్ని వర్గాల పట్ల అవగాహన కలిగించి ప్రభుత్వ పథకాలు వారికి అందేలా చూడాలన్నారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం గురించి వివరించారు. ఉచిత న్యాయసహాయం, లోకాయుక్త గురించి వివరించారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయసేవాధికారసంస్థ దృష్టికి తీసుకుని రావచ్చన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి.హరిబాబు, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎం.శాంత, ఎన్జీవోలు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానంతో ప్రయోజనం

కడప సెవెన్‌రోడ్స్ : ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు సీపీఎస్, జీపీఎస్ పెన్షన్ విధానాల కన్నా పాత పెన్షన్ విధానమే ప్రయోజనకరమైనదని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు తెలిపారు. మంగళవారం సాయంత్రం కడప కలెక్టరేట్‌లో వారు మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న సీపీఎస్ జీపీఎస్ పెన్షన్ విధానాలు ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఏమాత్రం ప్రయోజకరం కాదని, పాత పెన్షన్ విధానమే అన్ని విధాలా ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. పాత పెన్షన్ పునరుద్ధరణ కోసం ప్రతి ఒక్కరూ వివిధ రాజకీయ పార్టీలపై ఒత్తిడి తీసుకువచ్చే విధంగా ముందుకు వెళ్లాలని కోరారు. జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శి సీవీ రమణ, ఏజాస్ అహమ్మద్, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

జల్సాల కోసం బైక్ చోరీలు

మదనపల్లె : జల్సాలకు అలవాటు పడ్డ యువకులు, ముఠాగా ఏర్పడి డబ్బు కోసం బైక్ చోరీలను ఎంచుకుని, చివరకు పోలీసులకు చిక్కారు. నిందితులంతా 20 ఏళ్లలోపు యువకులైతే, వారిలో ఒకరు మైనర్ బాలుడు కావడం శోచనీయం. మంగళవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ యువరాజు వివరాలు వెల్లడించారు. పలమనేరుకు చెందిన సయ్యద్‌జావీద్ (20), షేక్ ముజంబిల్ అలియాస్ ముజ్జు (19), వీరితో పాటుగా మరో మైనర్‌బాలుడు చికెన్‌షాపులో పని చేస్తుంటారు. వీరి స్నేహితుడు పఠాన్ ఇర్ఫాన్‌ఖాన్ (20) పెయింటింగ్ పని చేస్తుంటాడు. వీరు అన్నమయ్య జిల్లా పీటీఎం మండలం ఎగువపల్లెకు చెందిన టూవీలర్ మెకానిక్ కనుమపల్లె బాలు (21)తో కలిసి చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో బైక్‌లను చోరీ చేసే వారు. చోరీ చేసిన వాహనాలను అనంతపురం జిల్లాకు తీసుకెళ్లి విక్రయించి, వచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తూ జీవించేవారు. ఈ క్రమంలో ఈ నెల 4న టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి రామారావుకాలనీలోని దాదాపీర్‌కు చెందిన రూ.1.90 లక్షల విలువ చేసే రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ చోరీ జరిగింది. చోరీపై దాదాపీర్ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణలో భాగంగా ఎస్ఐలు ఇనాయతుల్లా, వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో దర్యాప్తు బృందాలను నియమించారు. వీరు బైక్ చోరీ నిందితులను గుర్తించి, కొండామర్రిపల్లె పంచాయతీ ఇసుకనూతిపల్లె బైపాస్ రోడ్డు వద్ద అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.8 లక్షల విలువ చేసే 1 రాయల్ ఎన్‌ఫీల్డ్, 2 హీరో స్ప్లెండర్ ప్లస్, 1 హోండా ఆక్టివా, 2 హోండా డియోలను స్వాధీనం చేసుకున్నారు. పలమనేరు పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగు వాహనాలు, టూటౌన్ స్టేషన్ పరిధిలో రెండు వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులపై గతంలో కేసులు లేవని, నేర చరిత్ర లేకపోయినా, జల్సాలకు అలవాటు పడి నేరాలకు పాల్పడ్డారని సీఐ యువరాజు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన జస్వంత్‌రెడ్డి

ములకలచెరువు : ద్విచక్ర వాహనంలో వెళ్తున్న ఓ యువకుడిని బొలేరో వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని బురకాయలకోట పంచాయతీ బలకవారిపల్లికి చెందిన సుదర్శన్‌రెడ్డి కుమారుడు జస్వంత్‌రెడ్డి (17) ద్విచక్ర వాహనంలో టమాట పైరును పొలం వద్ద ఉన్న కూలీలకు ఇచ్చేసి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా.. సెంట్రల్ స్కూల్ ఎదురుగా బొలేరో వాహనం ఢీకొంది. ఈ ఘటనలో జస్వంత్‌రెడ్డికి తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనం ద్వారా మదనపల్లి ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరు ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ తిప్పేస్వామి ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు.

ఎన్నికల విధులకు పోలీసుల సన్నద్ధం

కొనసాగుతున్న యాంటీ–రయట్ డ్రిల్ శిక్షణ

కడప అర్బన్ : ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు ఇటీవల ప్రారంభమైన యాంటీ–రయట్ డ్రిల్ శిక్షణ ముమ్మరంగా కొనసాగుతోంది. మంగళవారం సివిల్, స్పెషల్ పార్టీ పోలీస్ సిబ్బంది నూతనోత్సాహంతో శిక్షణలో పాల్గొన్నారు. ఏ.ఆర్ అదనపు ఎస్పీ ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు శిక్షణను పరిశీలించి సిబ్బంది స్పందనను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిబ్బంది స్పందిస్తూ జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఆలోచనా విధానానికి తగ్గట్టుగా తాము మరింత మెరుగైన విధులు నిర్వర్తించేందుకు ఈ కార్యక్రమం దోహద పడుతుందని తెలిపారు. ఎంతో ఉపయోగకరంగా వుందని, తమలో ఎలాంటి కఠిన పరిస్థితులనైనా ఎదుర్కొనగలమనే ధీమాను పెంపొందించిందని జిల్లా ఎస్పీకి కృతజ్ఞతలు తెలియజేశారు. శాంతి భద్రతలకు విఘాతం కల్గించే విధ్వంసానికి ప్రయత్నించే అల్లరిమూకలను ఉక్కుపాదంతో అణిచివేసేందుకు ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. సంఘ విద్రోహ శక్తుల వెన్నులో వణుకు పుట్టించేలా తాము సమర్థవంతంగా విధులు నిర్వర్తించేలా కీలకంగా పని చేస్తుందన్నారు. ఇలాంటి కోర్సు వల్ల తామంతా సమష్టిగా వున్నామన్న ధైర్యాన్నిస్తుందని వారు పేర్కొన్నారు. శిక్షణలో భాగంగా గ్యాస్‌గన్‌తో గ్యాస్‌షెల్ వినియోగించే విధానం, వజ్ర వాహన వినియోగం, లాఠీ డ్రిల్ తదితర అంశాలపై తర్ఫీదు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్ డీఎస్పీ మురళీధర్, ఆర్ఐలు ఆనంద్, వీరేష్, శివరాముడు, టైటాస్, ఆర్ఎస్ఐలు, ఏఆర్, సివిల్, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.



కడప పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో యాంటీ-రయట్ శిక్షణ పొందుతున్న పోలీసులు